క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యుడు గీతాశ్రావణ్

ఏలేశ్వరం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజమహేంద్రవరం డెల్టా ఆసుపత్రి వైద్యుడు గీతాశ్రావణ్ సూచించారు. ఏపీ బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్రే నరసింహమూర్తి అధ్యక్షతన ఆదివారం సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గీతాశ్రావణ్ మాట్లాడుతూ ప్రస్తుతం వాతారణ మార్పుల నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. క్యానర్స్, గుండెవ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వీవీ కృష్ణారావు, రామలక్ష్మణరావు, శ్రీనివాసరావు, శ్రీనివాసకుమార్, జనార్దన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణ పరిధిలోని ఒకటి నుంచి 10 వార్డుల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రత్నాలరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ కోటనందూరు, 33/11 కేవీ తాండవ సబ్‌స్టేషన్, 11 కేవీ కత్రాళ్లకొండ, 11 కేవీ సీతారాంపురం ఫీడర్ల పరిధిలో డబుల్ జంపరింగ్, రోడ్ క్రాసింగ్ మరమ్మతులు నిర్వహిస్తున్నామన్నారు. దీంతో పట్టణంలోని కొండవారిపేట, టైలర్స్ కాలనీ, అమ్మాజీపేట, సీతారాంపురం, కంకిపాటివారి గరువు, శ్రీనివాసా సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్, రెల్లి కాలనీ, డ్రైవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

గౌరంపేటలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



గౌరంపేటలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని గౌరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గౌరంపేటలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. గ్రామాన్ని వ్యర్థ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సర్పంచ్ కోరారు.

అధ్వానంగా ప్రధాన రహదారి



అప్పన్నపాలెంలో రహదారిపై గుట్టగా వేసిన వ్యర్థాలు

ఏలేశ్వరం: పట్టణ పరిధిలోని అప్పన్నపాలెంలో ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారి మీదుగా నిత్యం పలు గ్రామాలకు రాకపోకలు కొనసాగుతున్నాయి. రహదారిపై మురుగునీరు ప్రవహించడంతో పాటు చెత్తను గుట్టలుగా వేయడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అప్పన్నపాలెంలోకి ప్రవేశించే రహదారిపైనే చెత్తను గుట్టగుట్టలుగా వేశారు. ఈ ప్రాంతంలో మురుగునీరు పోయేందుకు మార్గం లేకపోవడంతో రహదారిపైనే పారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

లోన్ యాప్ మోసాలపై అప్రమత్తత అవసరం

గండేపల్లి: లోన్ యాప్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గండేపల్లి ఎస్సై వై.గణేష్‌కుమార్ సూచించారు. మండల కేంద్రమైన గండేపల్లిలో ఆదివారం పోలీసులు వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మద్దిపాటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు రెడీ

- ఆర్‌బీకేల్లో విత్తనాలు, ఎరువులు సిద్ధం
- 17,596 హెక్టార్లలో వరి, పత్తి సాగు
- జలాశయాల్లో పుష్కలంగా సాగునీరు



పంపా రిజర్వాయర్‌లో నీటి నిల్వలు

తుని రూరల్: ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సిద్ధమయ్యారు. వాతవరణం చల్లబడి తొలకరి పలకరించడంతో రైతులు ఖరీఫ్ పనులను ప్రారంభిస్తున్నారు. మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో రైతులు ఏటా ఆలస్యంగా ఖరీఫ్ సాగు చేపడతారు. కాగా ఈ ఏడాది ప్రభుత్వ ప్రోత్సహంతో ముందస్తు ఖరీఫ్ సాగుకు సన్నాహాలు చేస్తున్నారు.

ముమ్మరంగా మట్టి నమూనాల సేకరణ

రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఆర్‌బీకేల్లో అందుబాటులోకి ఉన్నాయి. ఆర్‌జీఎల్ 2531, బీపీటీ 5204, ఎంటీయూ 1064 తదితర రకాల వరి విత్తనాలు, ఎంపీపీ, డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ వంటి ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. మరోపక్క భూసారాన్ని గుర్తించి, సవరించేందుకు వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏలు మట్టి నమూనాల సేకరణ ముమ్మరం చేశారు. మొదట విడత పెట్టుబడి సాయాన్ని (రైతు భరోసా నిధులు) ప్రభుత్వం ఇప్పటికే రైతుల ఖాతాలకు జమ చేసింది. కౌలుదారులకు సాగు పత్రాల జారీ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ ఏడాది 20 వేల హెక్టార్లలో వరి, పత్తి, చిరుధాన్యాలు, కూరగాయలు, ఆరుతడి పంటలు సాగుకు వ్యవసాయ అధికారులు ప్రణాళిక రూపొందించారు. అందుకు అవసరమైన వరి విత్తనాలు, ఎరువులను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచారు.

దుక్కులు పూర్తి

పంపా, తాండవ రిజర్వాయర్లు, పుష్కర, పీబీసీ కాలువల నుంచి సాగునీరు విడుదలతో పాటు తొలకరి వర్షాలు సమృద్ధిగా కురిస్తే మెట్ట ప్రాంతంలో రైతులు ఖరీఫ్ పనులను ముమ్మరం చేస్తారు. ఇప్పటికే పత్తి, కూరగాయల సాగుకు అనువుగా రైతులు రెండు విడతలు దుక్కులు పూర్తి చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే జూలై మొదట వారం నుంచి ఖరీఫ్ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

20 వేల హెక్టార్లలో ఖరీఫ్ సాగు

ఈ ఏడాది 20 వేల హెక్టార్లలో రైతులు ఖరీఫ్ సాగు చేసే అవకాశం ఉంది. ఇందులో ప్రధానంగా 15,645 హెక్టార్లలో వరి, 1,951 హెక్టార్లలో పత్తి, 2,404 హెక్టార్లలో ఆరుతడి పంటలైన మొక్కజొన్న, కూరగాయలు, మిరప, చిరుధాన్యాలు, అపరాలు, తదితర పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ప్రధానంగా తొండంగి, తుని, కోటనందూరు, రౌతులపూడి మండలాల్లో రైతులు వరి, తుని, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో రైతులు పత్తి సాగు చేస్తారు.



చామవరంలో పత్తి విత్తనాలు నాటేందుకు దుక్కులు చేసిన భూములు

సాగునీటి వసతులు

వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్‌లో పంపా, తాండవ రిజర్వాయర్లు, పుష్కర, పీబీసీ కాలువల నుంచి పంట పొలాలకు సాగునీరు అందనుంది. దీంతో పాటు చెరువులు, వర్షాలపై ఆధారపడి రైతులు ఖరీఫ్ పంటలు పండిస్తారు. తొండంగి మండలంలో భూములకు పంపా, కోటనందూరు మండలంలో భూములకు తాండవ రిజర్వాయర్ల నుంచి సాగునీరు చేరుతుంది. తుని మండలంలో 25 శాతం భూములకు పుష్కర, 20 శాతం భూములకు తాండవ నుంచి సాగునీరు చేరుతుండగా మరో 55 శాతం వర్షాధారంగా సాగవుతుంది. పంపా, తాండవ రిజర్వాయర్లలో నీటి నిల్వలు సమృద్ధిగా ఉండగా, పుష్కర నుంచి పంపాకు గోదావరి జలాలు మళ్లించడం ద్వారా ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందనుంది.

ఈ ఏడాది ఖరీఫ్ సాగు వివరాలు

మండలం	వరిసాగు లక్ష్యం (హెక్టార్లలో)	పత్తిసాగు లక్ష్యం (హెక్టార్లలో)	అందుబాటులో ఉన్న వరి విత్తనాలు (క్వింటాళ్లలో)	అందుబాటులో ఉన్న ఎరువులు (టన్నుల్లో)	కౌలుకార్డుల లక్ష్యం
తుని	2671	769	343.3	125	1280
తొండంగి	5506	89	200	40.5	1380
కోటనందూరు	3875	47	571.3	93.15	1065
రౌతులపూడి	2134	765	339.9	80.875	940
శంఖవరం	1459	281	54.5	20.25	1320
మొత్తం	15645	1951	1509	330.075	5985

బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలి



ఖరీఫ్‌కు అవసరమైన వరి విత్తనాలు, ఎరువులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయి. సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేస్తే బిల్లులు తీసుకుని భద్రపర్చాలి. విత్తనాలు మొలకెత్తకపోయిన, నకిలీలు వచ్చినప్పుడు బిల్లులు ఆధారంగా రైతులు నష్టపరిహారం పొందవచ్చు. మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడడం ప్రమాదకరం. వాతావరణ పరిస్థితులకు అనువైన పంటలను సాగు చేయాలి. కౌలుదారులు తప్పనిసరిగా సాగు పత్రాలు తీసుకోవాలి.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

జోరుగా ఇళ్ల నిర్మాణాలు



కాకరాపల్లి జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు

కోటనందూరు: మండలంలోని కాకరాపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాలతో వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ మంచి నీటి వసతి ఏర్పాటు చేశారు. దీంతో తొలుత నెమ్మదిగా ప్రారంభమైన నిర్మాణ పనులు ఇప్పుడు ఊపందుకున్నాయి. తొలి విడతలో ఫౌండేషన్ వరకూ నిర్మించుకున్న వారికి బిల్లులు సైతం అందడంతో లబ్ధిదారులు మరింత ఉత్సాహంగా ఇల్లు నిర్మించుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు నిరంతరం పర్యవేక్షించడంతో ఇబ్బందులు లేకుండా పనులు ముందుకు సాగుతున్నాయి.

భవనాల నిర్మాణానికి శంకుస్థాపన



కోటనందూరు పీహెచ్‌సీలో భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: స్థానిక పీహెచ్‌సీ ప్రాంగణంలో రూ.38 లక్షలతో ల్యాబ్, స్టోర్‌రూమ్, రోగుల వెయిటింగ్ హాల్ నిర్మాణానికి ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆదివారం శంకుస్థాపన చేశారు. నిర్ణీత సమయంలో నిర్మాణాలు పూర్తి చేసి భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. దీనిలో భాగంగానే వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చేశారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెలగా వెంకట కృష్ణాజీ, సర్పంచ్ లెక్కల ఉపేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, సుర్ల రాజు, రుత్తల జోగిరాజు, కురందాసు రాంబాబు, ఉల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుకు నిరసనగా ర్యాలీ



రంపయర్రంపాలెంలో ర్యాలీ చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం సభ్యులు

గోకవరం: దేవదాయ శాఖ అధికారుల నిర్ణయాలు పేదలకు వ్యతిరేకంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెంలో ఆదివారం ఆయన సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు దశాబ్దాల నుంచి లేని నిబంధనలు సుందరమ్మ సత్రం భూములకు బహిరంగ వేలంపాటలు నిర్వహించే సమయంలో విధించడం దారుణమన్నారు. గత కొన్నేళ్లుగా సత్రం భూములను గ్రామానికి చెందిన పలువురు అన్యాయంగా అనుభవిస్తుంటే లేని నిబంధనలు ఇప్పుడు విధించడం చూస్తుంటే అధికారులు భూస్వాములకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సత్రం భూముల బహిరంగ వేలంలో నిబంధనలను సవరించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారుల తీరుకు నిరసనగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రాజబాబు, బి.రమేష్, నాయకులు డి.సురేష్, గోలి మునలయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం



బెండపూడి వద్ద జాతీయరహదారిపై ప్రమాదకరంగా ట్రాక్టర్‌పై వెళ్తున్న జనం

తొండంగి: నిబంధనలకు విరుద్ధంగా గూడ్స్ వాహనాలపై ప్రజలు ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆషాఢమాసంలో మొదటి ఆదివారం కావడంతో బెండపూడి జాతీయరహదారిపై ఆటోలు, మినీ వ్యాన్లు, ట్రాక్టర్లు తదితర గూడ్స్‌వాహనాల్లో అనేక మంది తలుపులమ్మ దేవస్థానం, ఇతర క్షేత్రాలకు వెళ్లారు. వాహనాల అతివేగం కారణంగా గతంలో పలు వాహనాలు ప్రమాదాలకు గురైన సంఘనలు ఉన్నాయి. అయినప్పటికీ ప్రజల్లో మార్పు రావడం లేదు. ప్రజలు సురక్షితంగా ప్రయాణాలు సాగించాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

అవ్వాతాతల కళ్లల్లో వెలుగులు

- 'వైఎస్సార్ కంటి వెలుగు' కింద ఉచితంగా కంటి ఆపరేషన్లు
- నాలుగేళ్లలో 152 మందికి చికిత్స
- ఆనందం వ్యక్తం చేస్తున్న వృద్ధులు



వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ప్రత్తిపాడు రూరల్: వృద్ధుల కళ్లలో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. గతంలో అరవై ఏళ్లు దాటిన అవ్వాతాతలకు చూపు మందగించి తీవ్ర ఇబ్బందులు పడేవారు. వారి కష్టాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆరోగ్యశ్రీ కింద వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా కంటి చూపు సరిగా లేని వారిని గుర్తించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసి వారి కళ్లల్లో వెలుగులు నింపుతోంది. ఆపరేషన్‌కే పరిమితం కాకుండా అద్దాలు, మందులు అందజేస్తుండటంతో వారికి అదనపు ఖర్చులు లేకుండా చూస్తోంది.

స్థానిక ఆసుపత్రుల్లో...

ప్రత్తిపాడు మండలంలోని రాచపల్లి, పెద్దిపాలెం, శాంతిఆశ్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా అవ్వాతాతలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపుగా 152 మందికి క్యాటరాక్ట్ కంటి ఆపరేషన్లను చేశారు. కంటి సమస్య ఉన్న వృద్ధులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోన్ని వైద్యులను సంప్రదించి కంటిచూపు తిరిగి తెప్పించుకుంటున్నారు.

అవసరమైన వారికి ఆపరేషన్లు



ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి అవ్వాతాతలకు ముందుగా కంటి పరీక్షలు చేస్తున్నాం. వారిలో ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తిస్తున్నాం. ఆపరేషన్లు చేయించుకునేందుకు ప్రభుత్వ ఆసుపత్రులకు పేదలు వస్తున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకొని అవసరమైన వారికి క్యాటరాక్ట్ కంటి ఆపరేషన్లు చేస్తున్నాం.

– డాక్టర్ ఆర్.పవన్‌కుమార్, మండల వైద్యాధికారి, రాచపల్లి, ప్రత్తిపాడు మండలం

వృద్ధులకు వరం



ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ కంటి వెలుగు పథకం వృద్ధుల పాలిట వరంలా మారింది. నాకు కంటిచూపు మళ్లీ తిరిగి వస్తుందనుకోలేదు. పెద్దిపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లితే అక్కడ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి క్యాటరాక్ట్ కంటి ఆపరేషన్ చేశారు. దీంతో గతంలో లాగానే ఇప్పుడు చూడగలుగుతున్నాను. ఆపరేషన్ చేసేటప్పుడు, చేసిన తర్వాత ఎలాంటి ఇబ్బందులు లేవు.

– ముగ్గుల నాగమణి, పెద్దిపాలెం, ప్రత్తిపాడు మండలం

చూపు బాగా కనిపిస్తోంది



కంటిలో శుక్లాలు రావడంతో కళ్లు మసకబారి సరిగా కనిపించేది కాదు. కళ్లు కనిపించకపోవడంతో రోజువారీ పనులు చేసుకోవడం కూడా సాధ్యమయ్యేది కాదు. శాంతిఆశ్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించారు. వారు వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం క్యాటరాక్ట్ కంటి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ చేయించుకున్న తర్వాత చూపు బాగా కనిపిస్తోంది.

– పల్లా అప్పలకొండ, గజ్జనపూడి, ప్రత్తిపాడు మండలం

కబేళాకు పశువులను తరలిస్తున్న వాహనాలు సీజ్



ఏలేశ్వరంలో వాహనంతో పాటు స్వాధీనం చేసుకున్న పశువులు

ఏలేశ్వరం: ఎటువంటి అనుమతులు లేకుండా కబేళాకు పశువులను తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేసినట్టు స్థానిక పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పట్టణ శివారులో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. జడ్డంగి వైపు నుంచి వస్తున్న రెండు వాహనాల్లో పశువులను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. పశువులను అడ్డతీగల మండలం పులిగోగులపాడు గోరక్షణ శాలకు తరలించారు. రెండు వాహనాలను సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు.

బాధితులకు అండగా ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

గోకవరం: తిరుమలాయపాలెంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు, తదనంతరం తొలగింపు ఘటనలో బాధితులకు అండగా ఉంటామని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అన్నారు. మండలంలోని తిరుమలాయపాలెంలో ఆదివారం ఆయన పర్యటించారు. తమను సామాజిక బహిష్కరణ చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఎస్సీలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అంబేడ్కర్ విగ్రహం తొలగించిన చోటే విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ నిందితులపై తగు చర్యలు తీసుకుంటామని, అప్పటి వరకు సంయమనం పాటించాలన్నారు. ఈ ఘటనలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. అనంతరం ఎస్సీపేట వాసులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోడి పందేలాడుతున్న ఇద్దరి అరెస్ట్

కిర్లంపూడి: కోడి పందేలు ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్సై టి.రఘునాథరావు ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... ఎస్.తిమ్మాపురం గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్నట్టు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1050, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది శివ, గణేష్ ఉన్నారు.

రహదారి పునర్నిర్మించాలంటూ ఆందోళన



రమణయ్యపేట రహదారిపై ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: మండల పరిధిలోని రమణయ్యపేట–జె.అన్నవరం ప్రధాన రహదారిని పునర్నిర్మించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన నిర్వహించారు. రమణయ్యపేటలో ప్రధానరహదారిపై బీజేపీ నేతలు ఆందోళన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీకి ముఖద్వారమైన రహదారి గోతులమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రహదారిని అనుకుని ఉన్న క్వారీల నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రహదారి మరింత అధ్వానంగా మారిందన్నారు. దీంతో తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని పునర్నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి ధర్మరాజు, ఏనుగు ధర్మరాజు, కొల్లా శ్రీనివాస్, దాకే కృష్ణారావు, చిన్ని కృష్ణ, పతివాడ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సిగ్నల్ వ్యవస్థ తనిఖీ



సామర్లకోట రైల్వే స్టేషన్‌కు వచ్చిన డివిజనల్ అధికారి ద్వివేది

సామర్లకోట: విజయవాడ డివిజన్ ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్, టెలికమ్యూనికేషన్స్ ఇంజినీరు జికె ద్వివేది ఆదివారం విండో ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. విశాఖ నుంచి విజయవాడ వరకు 18047 అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో ఆయన ప్రతి స్టేషన్‌ను పరిశీలించారు. స్థానిక స్టేషన్‌లో మూడో నంబర్ ప్లాట్‌ఫాంపై ఆయనకు స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ స్వాగతం పలికారు. సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు జోగారావు, నారాయణరాజు, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కిశోర్, జూనియర్ ఇంజినీరు సౌమ్య, ఆర్పీఎఫ్ ఎస్సై ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.